తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# పద్ధతి మార్చుకోకపోతే వేటు తప్పదు!

**- మీరు మనుషులా దెయ్యాలా**
**- ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందిపై డ్వామా పి.డి. శ్రీనివాసప్రసాద్**



దొరవారిసత్రం, జనవరి 27 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని డ్వామా పి.డి. శ్రీనివాసప్రసాద్ అన్నారు. శుక్రవారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు మండలాల నుంచి వచ్చిన సిబ్బందితో సమీక్ష చేశారు. అయితే దొరవారిసత్రం మండలంలో ఎన్ఆర్ఇజిఎస్ పనులు, కూలీలు అంతంత మాత్రంగానే ఉండటంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పేరుపేరునా వారు చేస్తున్న విధులను పనితీరును పరిశీలించారు. అనంతరం ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందిపై ఆయన మందలించారు. ఇప్పటివరకు చాలా దారుణంగా పనులు చేస్తున్నారని, కనీసం పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నా సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎవరైతే నామమాత్రంగా పనులు చేస్తున్నారో అలాంటి ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లు, పైఅధికారులు కూడా స్వచ్ఛందంగా ముగించు కోవాలన్నారు. లేకపోతే వచ్చే నెలలో ఖచ్చితంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయిలో ఎంపిడిఓ ఖచ్చితంగా ఈ కార్యక్రమంపై నిఘా ఉంచాలని అన్నారు. వీరితో పాటు అంబుడ్స్‌మన్ నరసానాయుడు, ఎంపిడిఓ శింగయ్య తదితరులు ఉన్నారు.

# జగన్‌రెడ్డీ... భయం నా బయోడేటాలో లేదు

**-టిడిపి సైకోలకు తోలు తీసే పార్టీ -అన్నీ చక్రవడ్డీతో సహా చెల్లిస్తా -ప్రతి రూపాయి కక్కిస్తా.. పేదలకు ఖర్చు చేస్తా -కుప్పం గడ్డపై 1300కోట్ల పనులు చేసి ఓట్లు అడగండి -కుప్పం బహిరంగ సభలో నారా లోకేష్**



కుప్పంలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న నారా లోకేష్ - హాజరైన జనం

కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త : సిఎం జగన్‌రెడ్డీ.. భయం నా బయోడేటాలో లేదు.. మంచి కోసం పోరాడే దమ్ముంది నాలో.. ఇంటికి పంపుతామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం యువగళం పాదయాత్రలో భాగంగా కుప్పంలో నిర్వహించిన బహిరంగ సభలో నారా లోకేష్ ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ సైకోలకు తోలు తీసే పార్టీ అని, మరలా అధికారంలో వస్తే అన్నీ చక్రవడ్డీతో సహా చెల్లిస్తానని పేర్కొన్నారు. కుప్పం ప్రశాంతతకు మారుపేరన్నారు. అలాంటి ఇక్కడ పులివెందుల పంచాయతీలు చేస్తున్నారన్నారు. కుప్పం నుంచి చం ద్రబాబునాయుడు ఏడుసార్లు గెలిచారని అలాంటి చోట తెలుగుదేశం కార్యకర్తలపై దాడులు, కేసులు పెట్టారన్నారు. కుప్పంలో దొంగ మైనింగ్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇక్కడ తిన్న ప్రతి రూపాయి కక్కించి పేదలకు ఖర్చు చేస్తానన్నారు. కుప్పంలో కొంతమంది కుర్రకుంకలు చంద్రబాబు కుప్పానికి ఏం చేశారని నోరు పారేసుకుంటున్నారని కుప్పంలో వైద్య, ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజ్, ద్రవిడ వర్సిటీ తేవడంతో పాటు రోడ్లు, చెక్‌డ్యాములు నిర్మించారన్నారు. రైతుల కోసం ఇజ్రాయిల్ టెక్నాలజీ తెచ్చారన్నారు. ఉపాధి కోసం 25వేల మంది పనిచేసే పరిశ్రమలు తెచ్చారన్నారు. 613కోట్లతో హంద్రీ- నీవా పనులు 90శాతం పూర్తి చేశారన్నారు. పేదల కోసం 100కోట్లతో హౌసింగ్ తెస్తే వైకాపా ప్రభుత్వం ఆపేసిందన్నారు. కుప్పంపై సిఎం జగన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 1300కోట్ల ఆపేసిన పనులను పూర్తి చేసి కుప్పం గడ్డపై అప్పుడు ఓట్లు అడగాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోటకు మారుపేరు కుప్పం అన్నారు. రాష్ట్రంలో మద్యనిషేధం అన్న సిఎం జగన్‌రెడ్డి బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి కల్తీ మద్యం బ్రాండ్లతో మహిళల పుస్తెలు తెంచుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బిసిలకు 34శాతం ఉన్న రిజర్వేషన్లు 42శాతంకు తగ్గించారని ఇదేనా సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. బిసిలకు తాము అమలు చేసిన ఆదరణ పథకం అటకెక్కించారన్నారు. 56 కార్పోరేషన్లు ఏర్పాటుచేసి ఛైర్మన్లకు కుర్చీలు సైతం లేని పరిస్థితి దాపురించిందన్నారు.

**ఏమైంది దిశ చట్టం :**

పులివెందులలో నాగమ్మ అనే మహిళ మొదలు రాష్ట్రంలో 900 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగితే స్పందన లేదని నారా లోకేష్ విమర్శించారు. 21 రోజుల్లోనే దిశ చట్టం ద్వారా ఉరేయిస్తామన్న సిఎం జగన్‌రెడ్డి తెచ్చిన దిశ చట్టం ఏమైందని ప్రశ్నించారు. సిఎం జగన్‌రెడ్డిలా తాను తల్లి, చెల్లిని మెడపట్టి బయటకు గెంటనన్నారు. మహిళల డబ్బులను సిఎం జగన్ రెడ్డి లాక్కుంటున్నారన్నారు. కరెంట్, గ్యాస్, ఉప్పు,పప్పు, వంటనూనెల ధరలతో పాటు ఆర్టీసీ చార్జీలు సైతం పెంచేశారన్నారు. ఏడాదిన్నరలో మరలా చంద్రన్న వస్తాడని ధరలు తగ్గిస్తారని పేర్కొన్నారు.

**డైమండ్స్‌తో పాటు చీరలు.. గాజులు పంపించండి :**

తాను ఏదైనా మాట్లాడితే చీరలు, గాజులంటారా! మహిళలు చీరకట్టుకుని గాజులు పెట్టుకుంటే చేతకాని వారా అని ప్రశ్నించారు. డైమండ్లు పంపితే వాటిని మా అక్క చెల్లెళ్లకిచ్చి వారి ఆశీర్వాదం తీసుకుంటానని నారా లోకేష్ మంత్రి రోజాపై వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో అంతకుముందు స్థానిక శ్రీ వరదరాజ స్వామి ఆలయంలో నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎం.పి. రామ్మోహన్‌నాయుడు, మాజీ మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, కళా వెంకట్రావు, వర్లరామయ్య, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, స్థానిక నేతలు పిఎస్ మునిరత్నం, గౌనివారి శ్రీనివాసులు, గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, శాంతారాం, ఆర్ముగం, మంజునాథ్, వేలు, హర్షధర్మతేజ, ప్రతాప్, మునెప్ప, కౌన్సిలర్లు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రలో...

# తారకరత్నకు గుండెపోటు

**- కుప్పం పిఇఎస్‌లోనే వైద్యపరీక్షలు**
**- బెంగుళూరు నారాయణ హృదయాల నుంచి వైద్యులరాక - కుటుంబ సభ్యులు కుప్పం వచ్చిన అనంతరం నిర్ణయం**



నటుడు తారకరత్నను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం. పక్కన తారకరత్న ఫైల్‌ఫోటో

కుప్పంరూరల్, జనవరి 27 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రలో సినీ నటుడు నందమూరి తారకరత్న గుండెపోటుకు గురయ్యారు. హుటా హుటిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, దేశం శ్రేణులు కెసి ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో ఏంజియోగ్రామ్ చికిత్స అత్యవసరంగా చేపట్టి స్టంట్ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతానికి కుప్పంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. బెంగుళ్లూరు నారాయణా హృదయాల నుంచి అత్యాధునికి వైద్య పరికరాలతో వైద్యులు కుప్పం చేరుకున్నారు. తారక రత్న కుటుంబ సభ్యులు కుప్పం చేరుకున్న తరువాత బెంగుళ్లూరుకు తరలింపు నిర్ణయం వుందని నాయకులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించాలని నారా చంద్రబాబు నాయుడు సూచించారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తారకరత్న ఆరోగ్యంగానే వున్నారని, కోలుకుంటున్నాడని గుండెలో ఎడమవైపు 90శాతం రక్తనాళాలు బ్లాక్ అయినట్లు వైద్యులు తెలిపారని అన్నారు.

# సామాన్య భక్తులకు... మెరుగైన సేవలు

**-రూ.70 కోట్లుతో అభివృద్ధి పనులు -నిత్యాన్నదానం కార్యక్రమం విస్తరణ -పాలకమండలి తీర్మానం**



ఆలయ పాలకమండలి సమావేశంలో ప్రసంగిస్తున్న ఆలయ ఛైర్మన్, ఈఓ

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం వచ్చే భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని పాలకమండలి తీర్మానించినట్లు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. శుక్రవారం పాలకమండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి సంభందించి పలు అంశాలపై పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఇందులో భాగంగా దేవస్థానం అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రస్తుతం దేవస్థానం ద్వారా 2 వేల మంది భక్తులకు నిత్యాన్నదానం పథకం ద్వారా అన్న ప్రసాద వితరణ చేస్తుండగా ఈకార్యక్రమంను మరింత మందికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ప్రధాన ఆలయంలో స్థపతి సూచనల మేరకు వాస్తు రిత్యా పలు మార్పులు చేయాలని పాలకమండలి తీర్మానించినట్లు మోహన్‌రెడ్డి, వెంకటేశులు తెలిపారు. ద్రోణా కన్సల్టెంట్ వారి ద్వారా మాస్టర్ ప్లాన్ ఆమోదం కోసం కాంట్రాక్ట్ కుదుర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంభందించి పలు రకాల టెండర్లు నిర్వహించేందుకు పాలకమండలి నిర్ణయించినట్లు వారు తెలిపారు. దేవస్థానంలో మాస్టర్‌ప్లాన్ అమలులో భాగంగా సుమారు 70 కోట్లు రూపాయల వ్య అంచనాలతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభించ నున్నట్లు ఛైర్మన్, ఈఓలు తెలిపారు. దేవస్థానం వద్ద అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా గార్డెనింగ్ పనులు నిర్వహించేందుకు పాలకమండలి ఆమోదించినట్లు చెప్పారు. ఇదిలా వుండగా దేవస్థానంకు సంభందించి వివిధ బ్యాంకుల్లో వున్న, నగదు,బంగారు నిల్వలను వారు వెల్లడించారు. ఈసందర్భంగా వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లుగా 144.87 కోట్లు రూపాయలు, ఎస్బీ ఖాతాల్లో 18.68 కోట్లు వున్నట్లు తెలిపారు. దీనితో పాటు 17 కిలోల 680 గ్రాముల బంగారు, 1201 కిలోల వెండి లాకర్లలో వున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే నిత్యాన్నదాన పథకంకు ఎస్బీ అకౌంట్లో 2.93 కోట్లు, గోసంరణ ట్రస్ట్ నిధికి 21 లక్షలు ఎస్బీ ఖాతాలో వున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. ఆలయంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పారదర్శకంగా వుండేందుకు దేవస్థానంకు సంభందించిన నిధులను వెల్లడించినట్లు చెప్పారు. అలాగే పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు నరసింహులు శెట్టి, మారుతీశ్వరరావు, ప్రతిమ, రామసుబ్బమ్మ, సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి,హేమమాలిని, ఎస్వీ.కృష్ణారెడ్డి,,సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు,ఉమేష్, శివప్రసాద్,అర్చకులు వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై... కేంద్ర బృందం ఆరా

సదుం, జనవరి 27 ప్రభాతవార్త : సదుం మండలంలో జరిగిన ప్రభుత్వ పథకాలపై కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం శుక్రవారం ఆరా తీసింది. అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి పలు పనులను పరిశీలించింది. పథకాల అమలు తీరు పారదర్శకంగా అర్హులకు అందజేయడం పై జాతీయ స్థాయి బృందం సభ్యులు శిశిర కుమార్ సాహు, సత్యబర్థబేహ్రాలు సంతృప్తి వ్యక్తం చేశారు. వారు తొలుత సదుం మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘం మహిళలు,పెన్షన్లు పొందేవారిని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా చేపటిన పనుల పురోగతిపై సభ్యులు పరిశీలించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన,నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు,డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేసారు. అనంతరం వీటి ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలు గురించి వివరించారు. అదే విధంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఉపాధి పని దినాలు, పారంపాండ్‌ల నిర్మానం, పండ్లతోటల పెంపకం, అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన రికార్డుల నిర్వహణ,జాబ్ కార్డులో పోటో,వేతన వివరాలు, పని దినాలను పరిశీలించారు. పించన్ మంజూరుకు సంబంధించి అమలు అవుతున్న విధానం వాలంటీర్ల ద్వారా ప్రతినెల ఒకటో తేదీన పించన్ పంపిణీ తదితర వివరాలను లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ స్థాయి బృందం సభ్యులు జాండ్రపేటలో ఆవుల పెంపకాన్ని, చేనేత మగ్గాలను, భట్టువారిపల్లె వద్ద ఊరగాయల తయారీని పరిశీలించారు. యర్రాతివారిపల్లె గ్రామ సచివాలయ ంను పరిశీలించి పథకాలు అమలు అడిగారు. వ్యవసాయంపై ఎక్కువగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని అధికారులకు వివరించారు. సచివాలయ పరిధిలో 36 స్వయం సహాయక సంఘాల సభ్యులలో 363 మంది ఉన్నారని వారిలో చాలా మంది రుణాలుపొంది ఆవులు, గొర్రెలు,మేకల, చీరల వ్యాపారం చేసి అభివృద్ధి చెందుతున్నారని వివరించారు. అదే విధంగా బెల్లం తయారీ యూనిట్‌ను పరిశీలించి బెల్లం తయారీ ద్వార అభివృద్ధి చెందుతున్నవివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాల గదులను పరిశీలించి పాఠశాల బాగుందని కితాబిచ్చారు. అనంతరం గొంగివారిపల్లె వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేస్తున్న టెర్రకోట బొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వివిధ కళాకృతులతో తయారు చేసిన బొమ్మలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం తిమ్మానాయనపల్లె సచివాలయం పరిదిలో ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. అనంతరం సదుం బస్టాండును, సంతను పరిశీలించారు. కార్యక్రమంలో వారి వెంట డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు తులసి, గంగాభవాని, జడ్పీ సీఈఓ ప్రబాకరరెడ్డి, పిఆర్, ఆర్‌డబ్లుఎస్, ఎస ఈలు చంద్రశేఖరరెడ్డి, నాగజ్యోతి,మంత్రి పిఏ మురళీకృష్ణారెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప,జడ్పీమాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీడీ శ్రీనివాసులు, సర్పంచిలు, ఎంపీటీసీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

## దక్షిణ కైలాసానికి దిగివస్తున్న.. విద్యుత్ దేవుళ్ళు



శ్రీకాళహస్తి, జనవరి 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం వచ్చే నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌతుంది. శుక్రవారం సాయంత్రం స్వర్ణముఖి నదీ తీరాన రామసేతు వంతెన వద్ద విద్యుత్ దేవుళ్ళను దక్షిణ కైలాసానికి ఆహ్వానించారు. బ్రహ్మ,విష్ణు, మహేశ్వరుల విద్యుత్ ఆర్చి ప్రత్యేకాకర్షణగా ఉంది,

## నేడు ఏడు వాహనసేవలు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

కలియుగవైకుంఠం తిరుమలకొండపై సూర్యజయంతి,రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సకల ఏర్పాట్లు చేశారు. అశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చినా వర్షానికి, చలికి తట్టుకునేలా జర్మన్‌షెడ్లు నిర్మించారు. ఆలయ మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలను సిద్దం చేశారు. నేడు ఏడు వాహనాలు తొలివాహనంగా సూర్యప్రభ, చిన్నశేష,గరుడ, చక్రస్నానం, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలతో బాటు చివరగా రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహనంపై మలయప్ప స్వామి దర్శనమివ్వనున్నారు. ఈ ఏర్పాట్లను జెఇఓ వీరబ్రహ్మం,ఇంజనీరింగ్ అధికారులు, తిరుపతి ఎస్పి పరమేశ్వరరెడ్డి, సివిఎస్ఓ నరసింహకిశోర్ పరిశీలించారు.

# బాల్యవివాహాలు ఎక్కువగా శ్రీకాళహస్తిలోనే!

శ్రీకాళహస్తి, జనవరి 27 ప్రభాతవార్త : రాష్ట్రాన్ని బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని, అందులో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని పోర్డ్ స్వచ్ఛంద ప్రగతి డైరెక్టర్ కెవి.రమణ, ఫోర్డ్‌డైరెక్టర్ లలితమ్మలు సంయుక్తంగా పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం క్రై, మరియు ప్రగతి, పోర్డ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని బాల్యవివాహాల నిర్మూలన చేయడానికి కోరుతూ రాష్ట్ర స్థాయిలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ బాల్యవివాహాల్లో దక్షిణ భారదేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. సర్వే ప్రకారం ఏపిలో 29శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయని ఇది బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బాలికల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతోందన్నారు. ఏపిలో ప్రస్తుతం వెయ్యిమంది పురుషులకు 934మంది మాత్రమే మహిళలు ఉన్నారన్నారు. ఈపరిస్థితులు మారకపోతే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. ఆడపిల్లలు లేకపోతే సమాజంలో మనుగడ ఉండదన్నారు. నిరక్షరాస్యత, అవగాహన లేమి కారణంగా చదువుకునే వయస్సులో వివాహాలు చేయడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితుల్లో మార్పు వస్తుందని దీని వల్ల ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి వివాహాలను రిజిస్ట్రేషన్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బాల్యవివాహాల నిర్మూలనకు జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో 19జిల్లాలో తమ సంస్థ పనిచేస్తుందని ముఖ్యంగా ఎస్‌టి కాలనీల్లో బాల్యవివాహాల వల్ల జరిగే అనర్ధాలను వివరిస్తూ వారిలో చైతన్యాన్ని తీసుకువస్తున్నామన్నారు. బాల్యవివాహాల నిర్మూలన కోసం తమ సంస్థ 2004వ సంవత్సరం నుంచి పనిచేస్తోందన్నారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జరిగే స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం రోజున వందల సంఖ్యలో బాల్యవివాహాలు జరిగేవని ఈసమస్యపై చైల్డ్ రైట్స్ అండ్ యూ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్‌దాఖలు చేసిందన్నారు. కార్యక్రమంలో క్రై, పోర్డ్, ప్రగతి స్వచ్ఛంద సంస్థల సిబ్బంది తులసీరాంరెడ్డి, ప్రగతి స్వచ్ఛంద సేవాసంస్థ సిబ్బంది ప్రభాకర్,శిరీషా, రామచంద్ర, జయలక్ష్మిలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతి సంస్థ మరియు క్రై సంస్థ సభ్యుడు

# పేదల ఆనందమే జగనన్న ఆనందం : ఎమ్మెల్యే ఎంఎస్



బంగారుపాళ్యం, జనవరి 27 ప్రభాతవార్త: రాష్ట్రంలోని నిరుపేదల ఆనందమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆనందమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం సంక్రాంతిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను గృహస్తులకు ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడాలని లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్ నవరత్నాలు కార్యక్రమంకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకాలు ప్రతి లబ్దిదారుడికి చేరేలా గ్రామ సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. అర్హత కల్గి వుండి సంక్షేమ పథకాలు ఎవరికైనా మంజూరు కాకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమ శేఖర్, పారిశ్రామికవేత్త కోడి విద్యాసాగర్, ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసిల్దారుబెన్నురాజు,వైకాపానాయకులుమహేంద్ర, కిషోర్‌కుమార్‌రెడ్డి, దొరస్వామి, నాగరాజు, పద్మనాభం, రెడ్డప్ప, మాజీ సర్పంచ్ జ్యోతి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## వైకాపా నేత మృతికి సంతాపం.



పెద్దపంజాణి జనవరి 27 ప్రభాతవార్త : పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేట పంచాయతీ గుట్టూరు గ్రామానికి చెందిన వైకాపా నేత గుడిరెడ్డెప్ప మృతికి వైకాపా రాష్ట్రకార్యదర్శి,మాజీ ఎంపీపీ,రెడ్డివారి విజయ్‌భాస్కర్‌రెడ్డి సంతాపం తెలిపారు. శుక్రవారం అకస్మికమృతి చెందడంతో విజయ్‌భాస్కర్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట నిడిగుంట సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి,వైకాపా నాయకులు మునిరెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త : గణతంత్ర పర్వదినాన ఉత్తమ సేవా ప్రసంసా పత్రాన్నందుకొన్న ఎంపిడిఓ సుధాకర్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిటీసీ తొండ శ్రీరాములు, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, జగడం పద్మనాభరెడ్డి, మాజీ సర్పంచు గోవిందయ్య, తదితరులు ఎంపిడిఓ సుధాకర్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు.

## యువగళం పాదయాత్ర విజయవంతానికై అర్ధగిరిలో పూజలు



తవణంపల్లె, జనవరి 27 ప్రభాతవార్త: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగాలని కోరుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆపార్టీ మండల నాయకులు శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర దేశ రాజకీయాలలోనే చరిత్ర సృష్టిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మదుకుమార్ యాదవ్, జిలా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు వినాయకం, జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, నాయకులు సహోదర, రామయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంఘం నాయకుడి మృతికి సంతాపం



సదుం,జనవరి27 ప్రభాతవార్త: సదుం మండలం బీసీ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య (70) శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయన గత వారం పీలేరుకు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అయితే ఆయన కోమాలోకి వెళ్లిపోయి మృతి చెందాడు. ఆయన మృతికి రాష్ట్ర విద్యుత్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప,జడ్పీటీసీ సోమశేఖరరెడ్డిలు సంతాపం తెలిపారు.పెద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, దళితసంఘాల నాయకులు మల్లేపల్లె శ్రీనివాసులు, సీతాపతి తదితరులు నివాళులు అర్పించి జోహారులు అందించారు.

## నేడు చారాలలో రథసప్తమి వేడుకలు

**చౌడేపల్లి, జనవరి 27 ప్రభాతవార్త** : పంచాయతీ కేంద్రమైన చారాలలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యేటా ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ వేడుకల్లో ఉట్లోత్సవం హైలెట్‌గా నిలుస్తుంది. ఇందులో భాగంగా గ్రామ సమీపంలోని శ్రీ ప్రసన్నాంభ సమేత కాశీవిశ్వేరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## క్లాప్ యూజర్ ఛార్జీల వసూళ్ళు వేగవంతం

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా యూజర్ ఛార్జీల వసూళ్ళ ప్రక్రియను వేగవంతం చేయాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. క్లాప్ అమలు తీరుపై శుక్రవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆమె డివిజన్ల వారీగా యూజర్ ఛార్జీల డిమాండ్, వసూళ్ళపై వార్డు కార్యదర్శులతో సమీక్షించారు. క్లాప్ డివిజన్లలో కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు సంబంధించి తప్పనిసరిగా యూజర్ ఛార్జీలువసూలుచేయాలనిఆదేశించారు.అలాగే గృహాల నుండి క్లాప్ యూజర్ ఛార్జీల వసూళ్ళు వేగవంతం చేయాలన్నారు.యూజర్ చార్జీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నెలవారీ లక్ష్యాలను వార్డు కార్యదర్శులుపక్కాగాపూర్తిచేయాలనిస్పష్టంచేశారు.ఈసమావేశంలోఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ పాల్గొన్నా రు.

## లక్ష్యం మేరకు ఇళ్ళ నిర్మాణలు : కమీషనర్

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: నిర్ధేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం అనుపల్లి, బండపల్లి లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె లబ్దిదారులతో మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని అందుకోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కమీషనర్ ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్, అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రస్తుతం వివిధ దశల్లో వున్న నిర్మాణాలను మార్చి 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బిఎస్. ఆర్‌ఎల్ స్టేజీల్లో వున్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలన్నారు. లబ్దిదారులకు ఇటుకలు, ఇసుక సకాలంలో అందించేలా సహకారం అందించాలని, మేస్త్రీలను సమన్వయం చేసుకొని పనులు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శ్రీధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, నరసింహ, అనిమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**తవణంపల్లె, జనవరి 27 ప్రభాతవార్త:** మండలంలోని జొన్నగురకల గ్రామ సచివాలయ పరిధిలోని ఎగువ వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్యసేవలందించారు. తవణంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.ప్రియాంక ఆధ్వర్యంలో సిబ్బంది 104 వాహనం ద్వారా రోగులకు వైద్య సేవలందించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాంగ్రెస్ గెలుపుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సాధ్యం



కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ గెలుపు ద్వారానే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని పీసీసీ డెలిగేట్ ఏ.పరదేశి అన్నారు. ఎన్డీఏ గతి తప్పిన విధానాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్రకు మద్దతుగా ఏపీసీసీ పిలుపు మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు శుక్రవారం పీసీసీ డెలిగేట్ సభ్యుడు ఏ. పరదేశి ఆధ్వర్యంలో కాణిపాకంలో పాదయాత్ర ప్రారంభించారు. ఈమేరకు కాణిపాకంపరిసరగ్రామాల్లోప్రచారంనిర్వహించారు.కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిష్యనిధి సమస్యల పరిష్కారంకు చర్యలు



చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: కార్మికుల భవిష్యనిధికి సంబంధించి ఎదైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని కార్మికుల భవిష్యనిధి సంస్థ నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం కార్మికుల భవిష్యనిధి సంస్థ రీజినల్ కమీషనర్ డాక్టర్ జ్ఞానేంద్రకుమార్ కనేజియా పర్యవేక్షణలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల యాజమానులు, హెచ్‌ఆర్‌లు, ఉద్యోగులు, పెన్షన్‌దారులకు నిధి అప్కే నికర్ అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్మికుల భవిష్యనిధి పంస్థలో నిధి ఆప్కే నికర్ ద్వారా ఎదైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే కడప రీజినల్ పిఎఫ్ కార్యాలయంకు పంపి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి నెలా 27వ తేదీ జిల్లాలో కార్మికుల భవిష్యనిధికి సంబంధించి అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలలో తిరుపతి కార్మికుల భవిష్యనిధి సంస్థ సభ్యులు ప్రేమ్‌లాల్, హేమాద్రి, వివిధ సంస్థల యాజమానులు పాల్గొన్నారు.

## 31న పాత వాహనాలు వేలం

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: కలెక్టరేట్‌లోని పాత ప్రభుత్వ వాహనాలను 31వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి సమక్షంలో వేలం నిర్వహించనున్నారు. ఈ వాహనాల వేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా రెవెన్యూ అధికారి, చిత్తూరు పేరిట 10 వేల రూపాయలు డిడి చెల్లించి డిఆర్‌ఓకు అందజేసి వాహనాల వేలంలో పాల్గొనవచ్చును. ఇందుకు సంబంధించిన వివరాలను కలెక్టరేట్‌లోని ప్రొటోకాల్ విభాగంలోని అధికారులను సంప్రదించవచ్చును.

## లైన్‌మెన్ బద్రీకి ఉత్తమ ప్రసంశాపత్రం



గుడిపాల, జనవరి 27 ప్రభాతవార్త: మండలంలో చీలాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బద్రీకి తిరుపతిలో గురువారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ట్రాన్స్‌కో అధికారులు ఉత్తమ సేవా ప్రసంశాపత్రంను అందజేశారు. ఉత్తమ సేవలకు ప్రసంశాపత్రం అందడంతో క్షేత్ర స్థాయిలో మరింత మెరుగ్గ విధఉలు నిర్వర్తించి అందరి మన్ననలు పొందుతానని బద్రీ పేర్కొన్నారు. బద్రీని ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది అభినందించారు.

## సిరిధాన్యాల పంటలపై అవగాహన సదస్సు



**కుప్పంరూరల్, జనవరి 27 ప్రభాతవార్త** : మండలంలోని గుడ్లనాయనపల్లి ఆర్‌బికెలో శుక్రవారం సిరిధాన్యాల పంటలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలమనేరు ఎడిఎ అన్నపూర్ణ దేవి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2023సం॥ను చిరుధాన్యాల అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ఈనేపథ్యంలో రైతులు రాగులు, సజ్జలు, జొన్నలు, ఊదలు, అరికలు, కొర్రలు వంటి పోషకాల సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎఒ అమృతవల్లి, అధికారులు సుకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ఎఇఒ ఔరంగ్, సర్పంచులు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# యువగళం పాదయాత్రకు తరలిన తెలుగుదేశం నాయకులు



పాలసముద్రం, జనవరి 27 ప్రభాతవార్త: కుప్పంలో శుక్రవారం ప్రారంభమైన జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు పాలసముద్రం మండలం నుండి భారీగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. మండల దేశం పార్టీ అధ్యక్షుడు రాజేంద్రన్, ప్రధాన కార్యదర్శి ఎం.శేఖర్‌రాజు ఆధ్వర్యంలో దేశం నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో కుప్పంకు తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు దేశం కార్యదర్శి వాసునాయుడు, నాయకులు జె.విజయకుమార్, సాంబశివన్, ఆరుణ్‌నాథన్, రవినాయుడు, కంఠం ప్రతాప్‌నాయుడు, తంగరాజు, నాగరాజు, రంజిత్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## విధులు నిర్వహించని సచివాలయ సిబ్బందిపై చర్యలు : ఎంపీడీవో



బాలాయపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: విధులు సక్రమంగా నిర్వహించని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. అభివృద్ధి అధికారి శుక్రవారం కాటగుంట గ్రామ సచివాలయం సందర్శించి అక్కడ సచివాలయం ఉద్యోగుల పనితీరు, హాజరు, వారు చేయవలసినటువంటి రికార్డులు పరిశీలించడం జరిగింది. వలంటీరుతో పర్యవేషన్ అండ్ మానిటరింగ్ యూనిట్ కూడా జరిగిందది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చెప్పారు. విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవన్నారు.

## రామ్‌కుమార్‌రెడ్డిని కలిసిన దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్

వెంకటగిరి, జనవరి 27, ప్రభాతవార్త: వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమాం ారెడ్డిని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయాల అభివృద్ధిపై ఆయనతో చర్చించారు. పెంచలకోన నరసింహస్వామి ఆలయం, గ్రామశక్తి పోలేరమ్మ దేవాలయం తదితర ఆలయాల అభివృద్ధిపై చర్చించారు. పెంచలకోన ఆలయం ఈవో జనార్ధన్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

## సూళ్లూరుపేటలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి

సూళ్లూరుపేట, జనవరి 27 ప్రభాతవార్త :



శ్రీకృష్ణ దేవరాయలు సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం సూళ్లూరుపేట పట్టణంలో రాయలు 552వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అలవల కల్యాణ మండపం వద్ద బలిజ, కాపు సూళ్లూరుపేట నియో జకవర్గ అధ్యక్షుడు భీమన శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరి గాయి. రాయలసీమ బలిజ మహా సభ అధ్యక్షుడు వెలిశెట్టి శ్రీహరి రాయల్, ఆకుతోట రమేష్, ఉట్టి మునీంద్రబాబు, మార్కండేయులు, కొండలరావు, రాజేష్, గిరిబాబు, దంతాల రవి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి సెల్‌ఫోన్ అందించిన ఎస్ఐ

దొరవారిసత్రం, జనవరి 27 ప్రభాతవార్త



చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన పనబాక శ్రీనివాసులు డిసెంబర్ 4వ తేదీన నాయుడుపేట నుంచి సూళ్లూరుపేటకు వెళుతుండగా దొరవారిసత్రం వద్ద తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ విషయంపై అదే రోజు దొరవారిసత్రం పోలీసుస్టేషన్‌లో పనబాక శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ తిరుమలరావు సెల్‌ఫోన్‌ను టెక్నాలజీ సహాయంతో ట్రేస్ చేసి బాధితుడికి శుక్రవారం అందజేశారు.

# యువగళం యాత్ర చూసి వైసీపీ నేతలు భయపడుతున్నారు

- టీడీపీ రాష్ట్రష ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు



వెంకటగిరి, జనవరి 27 ప్రభాతవార్త: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించే యువగళం ర్యాలీ చూసి వైసీపీ నేతలు భయపడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యువగళం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. నారా లోకేష్ చేపట్టినటువంటి రాష్ట్ర వ్యాప్త యువగళం పాదయాత్రకు సంఘీభావంగా మేము సైతం అంటూ వెంకటగిరి నియోజకవర్గ అన్ని మండలాల నుంచి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లికి మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి 101 టెంకాయిలు కొట్టడం జరిగింది. తదుపరి అక్కడ నుంచి వెంకటగిరి తిరువీధుల్లో పాదయాత్రగా బయలుదేరి క్రాస్ రోడ్డు దగ్గర తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి పులుకోలు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణ అధ్యక్షులు శ్రీరామదాసు గంగాధర్ తెలుగు యువత ఆధ్వర్యంలో ఎన్టీర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, డక్కిలి మండల పార్టీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, బాలాయపల్లి మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, రాపూరు మండల అధ్యక్షుడు దందోలు ఈశ్వరరెడ్డి, సైదాపురం, కలువాయి మండల ముఖ్య నాయకులు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు రుద్రాక్షల కౌసల్య, పట్టణ అధ్యక్షురాలు మాధవి, ప్రధాన కార్యదర్శి ప్రసన్న, రాపూరు మండల అధ్యక్షురాలు రమణమ్మ, పార్లమెంటు, నియోజకవర్గ కమిటీ సభ్యులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ చిత్రపటాలు పంపిణీ

కోట, జనవరి 27 ప్రభాతవార్త :




కోటలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను రాష్ట్ర ఎడిపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్‌వి రమణయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆ మహనీయుడి సిద్ధాంతాలను అందరూ ఆచరించాలని సూచించారు.

## నేటి నుంచి నాలుగురోజులు బ్యాంకులు మూత

కోట, జనవరి 27 ప్రభాతవార్త : బ్యాంకులు శనివారం నుంచి నాలుగురోజుల పాటు మూతపడనున్నాయి. ప్రతి రెండు, నాలుగు శనివారాల్లో సెలవులు కాబట్టి ఆ రోజు బ్యాంకులు పనిచేయవు. ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోరుతూ రెండురోజుల పాటు సమ్మెకు దిగనున్నారు. సోమ, మంగళవారాల్లో బ్యాంకులు పనిచేయని పరిస్థితి నెలకొంది.

## ఎంఎల్‌సి ఎన్నికలపై బిజెపి వ్యూహం

కోట, జనవరి 27 ప్రభాతవార్త :



జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు కోరారు. శుక్రవారం స్థానిక బిజెపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో పూర్తి చేశారని, ఇంటర్మీడియట్ చదివే రోజుల నుంచి అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ నాయకుడిగా అనేక విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథంవాసు, గురుదేవయ్య, తిరుపాలయ్య, శరత్‌చంద్రారెడ్డి, యువమోర్చా అధ్యక్షులు పరశురామ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం : డీఈవో



వెంకటగిరి, జనవరి 27 ప్రభాతవార్త: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించడమే లక్ష్యమని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. వెంకటగిరిలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వెంకటగిరి ఏపీ ఆర్ స్కూల్ పనితీరు బాగుందని ప్రిన్సిపాల్ హేమలతను అభినందించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పలు ప్రశ్నలు వేసి పరిశీలించినట్లు చెప్పారు. గురుకుల పాఠశాలలో ఉత్తీర్ణతా శాతం సంతృప్తికరంగా ఉందన్నారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. హాస్టల్ గదిని, స్టాక్‌రూమ్‌ను పరిశీలించారు. అరటిపళ్లు చిన్నవిగా ఉన్నాయని, పెద్దవి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో తోట వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ హేమలత, టి.వల్లభాదాసు ఉన్నారు.

## నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోట, జనవరి 27 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 1991-95, 1992-96 మధ్య ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం కళాశాలలో జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులంతా ప్రపంచంలోని వివిధ దేశాల్లో ప్రముఖ రంగాల్లో ఉన్నారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్నారని చెప్పారు.

## తడలో మొదటి ర్యాంక్‌కు వంద పుస్తకాలు పంపిణీ

తడ, జనవరి 27 ప్రభాతవార్త :



తడ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఽక్రవారం మొదటి ర్యాంక్‌కు వంద సూత్రాలు అనే పుస్తకాలను పంచిపెట్టారు. సూళ్లూరుపేట సేవా సమాఖ్య సహకారంతో విద్యార్థి వారధి ఫౌండేషన్ గద్వాల్ జిల్లా ఛైర్మన్ జి.సుబ్బరాజు సహాయంతో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన ఈపుస్తకాన్ని 60 మంది పదో తరగతి విద్యార్థులకు బహూకరించారు. సేవాసమాఖ్యసభ్యులు ఉస్మాన్‌బాషా, పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

